రాజీవ్ ఆరోగ్యశ్రీ పేదలకు వరం



గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో ఆరోగ్య శ్రీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: రాజీవ్ ఆరోగ్యశ్రీ నిరుపేదలకు వరం లాంటిదని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ పథకం ద్వారా లభించే ప్రయోజనాలను అవసరమైన వారు వినియోగించుకోవాలన్నారు. రూ.10 లక్షల వరకు ప్రభుత్వం ఖర్చును భరిస్తుందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు ప్రైవేటు ఆసుపత్రుల్లో సైతం ఈ పథకం ద్వారా లబ్ధిపొందవచ్చన్నారు. గతంలో నయం కాని వ్యాధులతో శస్త్రచికిత్స అవసరమైన వారు ఈ పథకం ద్వారా రియింబర్స్ అయ్యే డబ్బు సరిపోక ఇబ్బందులు పడే వారన్నారు. కొత్త పథకంతో శస్త్రచికిత్సలు చేయించుకోవచ్చన్నారు. గోల్కొండ ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మజహర్ ఉల్లా మాట్లాడుతూ.. అన్ని వయస్సుల మహిళలకు ప్రభుత్వం మహాలక్ష్మి పథకం అమలులోకి తీసుకొచ్చిందన్నారు. ఈ పథకం ద్వారా ప్రయాణించే మహిళలకు ప్రత్యేకంగా ముద్రించిన టికెట్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. మెహిదీపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ మూర్తి, నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లిస్ నాయకులు వజీఉజ్జమా, హారూన్‌ఫరాన్, బదరుద్దీన్ తదితరులున్నారు.

నిలోఫర్‌లో..

నాంపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్యసాయం రూ.10 లక్షల పెంపుతో పాటుగా మహిళలకు ఉచిత ప్రయాణ మహాలక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ అన్నారు. ఆదివారం మధ్యాహ్నం రెడ్‌హిల్స్‌లోని నిలోఫర్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రారంభించి మాట్లాడారు. నిరుపేదలకు వైద్యం కోసం ప్రతి కుటుంబానికి రూ.10 లక్షల ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం గొప్ప విషయమని తెలిపారు. సూపరింటెండెట్ డాక్టర్ ఉషారాణి, ఆర్ఎంఓ–1 జ్యోతి, డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకట్, ఆర్టీఓ సూర్య ప్రకాష్ వైద్య బృందం, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

రహదారి ఇలా.. ప్రయాణమెలా !



గుంతలమయంగా మారిన రహదారి

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట పాత ఫ్లై ఓవర్ వద్ద రహదారి గోతులమయంగా మారడంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఎగువన మురుగు పారడంతో వాహనదారుల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. రహదారి పూర్తిగా గుంతలమయంగా మారింది. ఈ మురుగుతో పనికోసం ఎదురుచూస్తున్న భవన నిర్మాణ కార్మికులు దుర్వాసతో ఇబ్బంది పడుతున్నారు. చాంద్రాయణగుట్ట నుంచి కేశవగిరి వైపు వెళ్లే వాహనదారుల కోసం బారికేడ్లను ఏర్పాటు చేశారు. మురుగుతో కొందరు వాహనదారులు భారీకేడ్ల అవతలి వైపు నుంచి వెళ్లే క్రమంలో ప్రమాదాలకు గురౌతున్నారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి మురుగు సమస్యను పరిష్కరించి, రహదారికి కూడా మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

కేసీఆర్ కోలుకోవాలని ప్రత్యేక పూజలు



కార్వాన్ దర్బార్ మైసమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న మిత్రకృష్ణ

జియాగూడ/గోల్కొండ : బీఆర్ఎస్ అధినేత మాజీ సీఎం కేసీఆర్ త్వరగా కోలుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్వాన్‌లోని శ్రీ దర్బార్ మైసమ్మ ఆలయంలో బీఆర్ఎస్ కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మిత్రకృష్ణ ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల ముద్దుబిడ్డ, తెలంగాణ రాష్ట్ర పోరాట సారధి అయిన కేసీఆర్ త్వరగా కోలుకుని ప్రజల్లోకి రావాలని ఈ పూజలు నిర్వహించామన్నారు. బీఆర్ఎస్ నాయకులు తూమ్‌కుంట అరుణ్‌కుమార్, శేఖర్‌రెడ్డి తదితరులున్నారు.

శాస్త్రీయ కళలపై మక్కువ కల్పించాలి



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

గన్‌ఫౌండ్రీ: నేటి యువతరానికి శాస్త్రీయ సంగీత కళల పట్ల మక్కువ కల్పించాలని సినీనటి డాక్టర్ ఆర్.ప్రసన్న రాణి అన్నారు. ఆదర్శ్‌నగర్‌లోని బిర్లా సైన్స్ సెంటర్‌లో విజయమాధవి సేవా సాంస్కృతిక అకాడమీ ఆధ్వర్యంలో కార్తీకమాస నృత్య మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో కళలు అంతరించి పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అంతకు ముందు చిన్నారుల నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పలువురు నృత్య గురువులను సన్మానించారు. సినీనటి డాక్టర్ పద్మిని, అడిషనల్ ఎస్పీ తేజావత్ రాందాస్, ఫిట్నెస్ నిపుణురాలు అనుప్రసాద్, సంస్థ వ్యవస్థాపకురాలు విజయమాధవి పాల్గొన్నారు.

పెరుగుతున్న కాలుష్యంతో జీవరాశులకు ప్రమాదం



సెమినార్‌లో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థినులు

గోల్కొండ: వాతావరణ కాలుష్యం రోజురోజుకు పెరుగుతున్నందున మానవాళితో పాటు ఇతర జీవరాశుల జీవితాలపై ప్రభావం పడుతుందని తెలంగాణ స్టేట్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సీనియర్ ప్రాజెక్ట్ ఆఫీసర్ నాగేశ్వర్‌రావు అన్నారు. షేక్‌పేట్‌లోని జి. నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం సందర్భంగా ‘కాలుష్యం వాటి నివారణలు’ అనే అంశంపై సెమినార్ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. మనం మనకు తెలియకుండానే ఎన్నోసార్లు వాతావరణాన్ని కలుషితం చేస్తున్నామన్నారు. హానికరమైన వ్యర్థాలను తగలబెట్టడం వల్ల వచ్చే పొగ జీవరాశికి రోగాలు అంటబెడుతుందన్నారు. మరోవైపు ఇళ్ల నిర్మాణం, రోడ్ల విస్తరణ తదితర కారణాల వల్ల పచ్చని చెట్లను నరికి వేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక చెట్టును నరికితే దానికి బదులుగా ఆ ప్రాంతం సమీపంలోనే మొక్కలు నాటాలన్న నిబంధనను అమలులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. అడవులు, సాగు భూములలో కూడా చెట్లు నరికివేతకు గురవుతుందన్నారు. దీనిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకునేలా చట్టంలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. బాబుల్ ఎన్‌జీఓ డైరెక్టర్ గంగాధర్‌పాండే, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.రమేష్‌రెడ్డి, కన్వీనర్ డాక్టర్ కె.శ్యామల దేవి, బేసిక్ సైన్స్ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీ డాక్టర్ చరణ్‌సింగ్‌తో పాటు అధ్యాపక బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.

పాతబస్తీ రోడ్లతో..

తప్పని ట్రాఫిక్ తిప్పలు !

- వాహనదారులకు నరకం చూపిస్తున్న ట్రాఫిక్ జామ్‌లు..
- కనిపించని ఫుట్‌పాత్‌లు, నడిరోడ్డుపై పాదచారులు
- రోడ్డుపైనే వ్యాపారాలు, ముందుకు సాగని వాహనాలు



గుల్జార్‌హౌజ్ చౌరస్తా వద్ద నడిరోడ్డుపై కాలినడకన సందర్శకులు

చార్మినార్: చార్మినార్ ఇన్నర్ రింగ్ రోడ్డు, ఔటర్ రింగ్ రోడ్లతో పాటు పరిసర ప్రాంతాల రోడ్లలో రోజూ వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటోంది. ప్రధాన కూడళ్లలో అక్కడక్కడ ట్రాఫిక్ సిగ్నల్స్ అందుబాటులోకి వచ్చినప్పటికీ.. ఇంకా ట్రాఫిక్ సమస్య కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ట్రాఫిక్ పోలీసులు అవసరమైన మేరకు ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకున్నా.. చిరు వ్యాపారులు, వాహనదారులు వారికి సహకరించడం లేదు. కొంత మంది వాహనదారులు త్వరగా తమ గమ్యానికి వెళ్లాలనే తొందరలో ట్రాఫిక్‌జాంలతో పాటు ప్రమాదాలకు కారణమవుతున్నారు.

అసలే ఇరుకు రోడ్లు.. ఆపై సెలవులొస్తే చాలు..

- నయాపూల్ నుంచి గుల్జార్‌హౌజ్ వరకు, దారుషిఫా చౌరస్తా నుంచి బీబీబజార్ చౌరస్తా వరకు, మదీనా నుంచి పురానాపూల్ చౌరస్తా వరకు ట్రాఫిక్ జాం కనిపిస్తుంది.
- ఉదయం, సాయంత్రం వేళల్లో ఇక్కడ వాహనాలతో అడుగుపెట్టిన వారెవరైనా.. అంగుళమైనా ముందుకు కదలడం లేదనే తెలుస్తోంది.
- నడిరోడ్లను ఆక్రమించి కొనసాగే చిరు వ్యాపారాలతో నిత్యం ట్రాఫిక్ జాంలు తప్పడం లేదు. వాహనదారులు కూడా నిబంధనలు పాటించడం లేదనే ఆరోపణలున్నాయి. ట్రాఫిక్ సిబ్బంది వారించబోయినా వాగ్వాదానికి దిగుతున్నట్లు సమాచారం.

నడిరోడ్డుపై వ్యాపారాలు... ముందుకు సాగని వాహనాలు...

- ఫుట్‌పాత్‌లే కాదు.. రోడ్లు సైతం ఆక్రమణ...
- పండ్లు, గాజులు, దుస్తులు, నిత్యావసర సామగ్రి.. ఒక్కటేమిటి పాతబస్తీలో అన్ని రకాల వస్తువులు రహదారిపైనే అమ్మకానికి ఉంటాయి.
- వాహనాల పార్కింగ్ కూడా నడిరోడ్డుపైనే.. ఇక ట్రాఫిక్ సిబ్బంది నిబంధనల సాకు చూపి తమ టార్గెట్ పూర్తి చేసుకుంటున్నారని వాహనదారులు వాపోతున్నారు.
- పర్యాటకం, వ్యాపార, నివాసపరంగా పాత నగరానికి జనం తాకిడి ఎక్కువగా ఉంటోంది.



ట్రాఫిక్ దిగ్బంధంలో వాహనాలు

ప్రభుత్వ విభాగాల ఉన్నతాధికారులు దృష్టిసారించాల్సిన అంశాలు...

- పాతబస్తీలో ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన చోట సిబ్బంది సంఖ్యని పెంచాలి.
- ఆర్టీసీ, పోలీస్, ట్రాఫిక్ ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు సమన్వయంతో పనిచేస్తే ఆశించిన ఫలితాలు ఉంటాయి.
- ఫుట్‌పాత్‌లు, రోడ్లపైనే అక్రమ వ్యాపారాలు కొనసాగిస్తున్న వారిని వెంటనే తొలగించాలి.
- రోడ్లకు ఇరువైపుల కొనసాగుతున్న ఫుట్‌పాత్ వ్యాపారాలు, ఆక్రమణలను నియంత్రించాలి.
- రోడ్లను ఆక్రమించి అమ్మకాలు జరుపుతున్న వారిని కట్టడి చేయాలి. చార్మినార్ ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్లలో అవసరమైన చోట రోడ్ల విస్తరణ జరగాలి.
- ఇప్పటికే విస్తరించిన రోడ్ల కూడళ్లలో ట్రాఫిక్ నియంత్రణ చేపట్టాలి. అధ్వానంగా ఉన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేయాలి.
- అనుమతి లేకుండా రోడ్లను ఇష్టం వచ్చినట్లు తవ్వే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.
- రోడ్లపై విచ్చలవిడి పార్కింగ్‌లను నిషేధించాలి.

1న జీతాలు చెల్లించాలి



కవ్వం లక్ష్మారెడ్డి

సుల్తాన్‌బజార్: ఎన్‌హెచ్‌ఎంలో ల్యాబ్ టెక్నీషియన్లుగా దాదాపు 25 ఏళ్లుగా పనిచేస్తున్నప్పటికీ గత ప్రభుత్వం రెగ్యులర్ చేస్తుందనే నమ్మకంతో ఎదురు చూశామని ల్యాబ్ టెక్నీషియన్ రాష్ట్ర అధ్యక్షుడు కవ్వం లక్ష్మారెడ్డి అన్నారు. దీనిపై గత ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, ప్రస్తుత ప్రభుత్వమైనా.. తమ సర్వీస్‌ని గుర్తించి రెగ్యులర్ చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్‌హెచ్‌ఎంలో దాదాపు 16 వేల మంది దాదాపు 22 ఏళ్ల నుంచి పనిచేస్తున్నా.. ఖర్చులకు తగినట్లు జీతాలు లేవన్నారు. వచ్చే జీతమైనా, 1వ తేదీన ఇస్తే ఈ జీతాలతో ఇబ్బంది పడాల్సిన పరిస్థితి రాదని పేర్కొన్నారు. నూతన ప్రభుత్వం ఇప్పటి నుంచైనా.. ప్రతినెల 1వ తేదీన జీతాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఉచిత వైద్యశిబిరం

సుల్తాన్‌బజార్: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని భజరంగ్‌సేనా రాష్ట్ర అధ్యక్షులు ఎన్ఆర్.లక్ష్మణ్‌రావు పిలుపునిచ్చారు. తెలంగాణ చాంబర్ ఆఫ్ కెమిస్ట్ అండ్ డ్రగిస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ప్రజలకు వైద్యులు వివిధ వైద్య పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. స్వచ్ఛంద సంస్థలు ఉచిత వైద్య శిబిరాల ద్వారా ప్రజలకు సేవ చేయడం అభినందనీయమన్నారు. డాక్టర్ గీసులాల్ జైన్, ఓంప్రకాష్ అగర్వాల్, సంజయ్ జైన్, అరవింద్‌కుమార్ తదితరులున్నారు.

రెండు గ్యారంటీలను సద్వినియోగం చేసుకోవాలి

దూద్‌బౌలి: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అమలుల్లోకి తీసుకొచ్చిన రెండు గ్యారంటీ పథకాలను చార్మినార్ నియోజకవర్గంలోని పేట్లబురుజు ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో ఎమ్మెల్యే మీర్ జుల్ఫీకర్ అలీ ప్రారంభించారు. ఫలక్‌నుమా ఆర్టీసీ డిపోకు చెందిన అధికారులతో కలిసి మహాలక్ష్మి పథకాన్ని మహిళలతో కలిసి ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద రోగులకు తమ వైద్య సేవలను పొందేందుకు రూ.10 లక్షల వరకు నిధులు మంజూరు అవుతాయన్నారు. ఆసుపత్రి వైద్యాధికారులతో పాటు ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మీర్ జుల్ఫీకర్ అలీ

కోటకు పర్యాటకుల తాకిడి !



పర్యాటకులతో కిటకిటలాడుతున్న గోల్కొండ కోట

గోల్కొండ: గోల్కొండ కోటకు పర్యాటకుల తాకిడి పెరిగింది. సెలవు రోజు కావడంతో ఆదివారం వేల సంఖ్యలో వచ్చిన పర్యాటకులతో గోల్కొండ కోట కిటకిటలాడింది. నగరం నుంచే కాకుండా పొరుగు జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి సైతం భారీగా పర్యాటకులు కోటకు వచ్చారు. పర్యాటకుల వాహనాలతో రాందేవ్–గోల్కొండ, బంజారా దర్వాజ–గోల్కొండ రోడ్లపై ట్రాఫిక్‌జామ్ ఏర్పడి వాహనాలు బారులు తీరాయి. ఉదయం 8 గంటల నుంచే కోట వద్ద టికెట్ కోసం పర్యాటకులు బారులు తీరారు. భారీ బండరాళ్లతో ఉన్న అక్కన్న మాదన్న కార్యాలయం, సైనికుల గదులను చూసి పర్యాటకులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. రాణిమహల్ ఎదురుగా ఉన్న ఫౌంటెన్ వద్ద యువ జంటలు సెల్ఫీలు దిగుతూ సంబరపడ్డారు. కోటలోని హిస్టరీ గైడ్స్ భారీగా పర్యాటకులు రావడంతో తమకు చేతి నిండా పని దొరికిందని హుషారుగా పనిచేశారు.

కులమతాలకతీతంగా అన్ని వర్గాల సంక్షేమం



ఎంబీటీ నాయకుడు అంజదుల్లా ఖాన్‌ను సన్మానిస్తున్న నేతలు

గౌలిపురా: వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో హైదరాబాద్ నుంచి పోటీ చేస్తానని, తనను గెలిపించే బాధ్యత ప్రజలపైనే ఉందని ఎంబీటీ నేత అంజదుల్లాఖాన్ అన్నారు. తన తండ్రి దివంగత నేత, ఎంబీటీ వ్యవస్థాపకుడు అమానుల్లాఖాన్ పాతబస్తీలో కులమతాలకతీతంగా అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేశారన్నారు. తన గెలుపు కోసం కృషి చేసిన అన్ని వర్గాల ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. యాకుత్‌పురా నియోజకవర్గంలోని పటేల్‌నగర్‌లో ఆదివారం ఎంబీటీ జాయింట్ కన్వీనర్ బుంగ శివకుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యాకుత్‌పురా నియోజకవర్గం నుంచి పోటీచేసిన తాను 878 ఓట్ల స్వల్ప మెజార్టీతో ఓటమి పాలయ్యానని, ఎన్నికల్లో గెలుపోటములు సహజమేనన్నారు. ఆయన స్ఫూర్తితో తాను కూడా ముందుకు సాగుతున్నానన్నారు. న్యాయవాది ప్రకాష్, విశ్వనాథ్, మనోజ్ పండిత్, ప్రసాద్ పండిత్, బాలాజీ, మనోజ్‌కుమార్, బుంగ యాదగిరి, అనిల్‌కుమార్, సాయికుమార్, శ్రావణ్‌కుమార్, సందీప్‌కుమార్‌తో పాటు బస్తీ ప్రజలు పాల్గొన్నారు.

మంచి కుటుంబంతో మంచి సమాజం

బహదూర్‌పురా: కుటుంబ విలువలు దిగజారుతున్నాయని ఆందోళన చెందడం కంటే బాంధవ్యాల పటిష్టానికి మన వంతుగా మనమేం చేయాలో ఆలోచించాలని ‘సోల్జర్స్ ఆఫ్ క్రిస్ట్ మినిస్ట్రీస్ ఇంటర్నేషనల్’ వ్యవస్థాపక అధ్యక్షులు బిషప్ డాక్టర్ కే.జే.ఉదయ్‌రాయ్ భూషణ్ అన్నారు. ఆదివారం చాదర్‌ఘాట్‌లోని మెస్కో కన్వెన్షన్ సెంటర్‌లో జమాతే ఇస్లామీ హింద్ మలక్‌పేట్‌శాఖ ఆధ్వర్యంలో ‘పటిష్ట కుటుంబం–పటిష్ట సమాజం’ అనే అంశంపై గెట్ టూ గెదర్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కుటుంబం విచ్ఛిన్నమైతే సమాజం కూడా విచ్ఛిన్నం అవుతుందన్నారు. నేటి సమాజంలో ఒకే ఇంట్లో జీవిస్తున్నప్పటికీ భార్యభర్తలు, తోబుట్టువులు, ఇతర కుటుంబ సభ్యుల మధ్య అప్యాయత, అనుబంధాలు దూరమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఖురాన్ తెలుగు అనువాదకులు మహ్మద్ అజీజ్–ఉర్–రెహమాన్ మాట్లాడుతూ.. కుటుంబ సభ్యుల మధ్య నమ్మకం, పారదర్శకత ఉండాలన్నారు. మంచి కుటుంబం ఏర్పడినప్పుడే మంచి సమాజం ఏర్పడుతుందన్నారు. కుటుంబ విలువలు, కుటుంబ సభ్యుల మధ్య అనుబంధాలు, ఖురాన్ బోధనలను వివరించారు. జమాతే ఇస్లామీ హింద్ మలక్‌పేట్ శాఖ అధ్యక్షులు ముజీబుల్ అలా, సాయి చైతన్య జూనియర్ కళాశాల చైర్మన్ సీహెచ్.సురేష్‌బాబు, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు నాలేశ్వరం శంకరం, ఓల్డ్‌సిటీ చర్చెస్ కమిటీ ప్రెసిడెంట్ బుర్రగళ్ల ఆనందం, జమాతే ఇస్లామీ హింద్ మలక్‌పేట్ శాఖ సందేశ విభాగం కార్యదర్శి సలీం అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య రామమందిర అక్షింతలకు పూజలు

చార్మినార్: ఇప్పటికే అయోధ్య నుంచి నగరానికి వచ్చిన రామమందిరం అక్షింతలతో రామ భక్తులు ఆదివారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురానాపూల్ విఠలేశ్వర మందిరం నుంచి అక్షింతల కలశపాత్రను తలపై పెట్టుకుని పురానాపూల్, గల్బవీధి, పార్థివాడ తదితర ప్రాంతాల్లో రామ భక్తులు ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శన అనంతరం తిరిగి దేవాలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామ భక్తులతో పాటు బీజేపీ నాయకురాలు మెహూరాణి అగర్వాల్, నాయకులు ఉమేష్ అగర్వాల్, పవన్ మిశ్రా తదితరులు మాట్లాడుతూ.. జనవరి 22న అయోధ్యలోని రామ మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా నగరంలో ఈ పూజా కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. దీనిలో భాగంగా ఈ నెల 13న గుల్జార్‌హౌజ్‌లోని జెండే వాలా హనుమాన్ మందిరం నుంచి అక్షింతల ప్రదర్శన కార్యక్రమం ఉంటుందన్నారు.

ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్‌కు శుభాకాంక్షలు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న శివకుమార్

చాంద్రాయణగుట్ట: రామగుండం ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించిన రాజ్ ఠాకూర్‌కు పాతబస్తీ చాంద్రాయణగుట్టకు చెందిన ఐఎన్‌టీయూసీ నాయకుడు ఎ.శివకుమార్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆదివారం ఆయనను కలిసి పూలబొకే అందజేసి శాలువాతో సన్మానించారు.

‘కాంగ్రెస్‌తోనే బంగారు తెలంగాణ సాధ్యం’



మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సత్కరిస్తున్న గౌరి సతీష్

అబిడ్స్ : సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ హయంలోనే తెలంగాణ బంగారు తెలంగాణగా మారుతుందని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరి సతీష్ పేర్కొన్నారు. కాంగ్రెస్ హయంలోనే అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి జరుగుతుందన్నారు. ఆదివారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆయన ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం సతీష్ మాట్లాడుతూ.. పదేళ్లుగా రాష్ట్రాన్ని దోచుకున్న దొరల పాలన అంతమైందని అభిప్రాయపడ్డారు. ఇందిరమ్మ రాజ్యం రావడంతోనే ప్రజలకు పెద్ద ఎత్తున సంక్షేమం జరుగుతుందని పేర్కొన్నారు. ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలుచేసి చూపిస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోండి



రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే రాజాసింగ్

అబిడ్స్ : సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గోషామహాల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పిలుపునిచ్చారు. ఆదివారం ఎస్‌పీహెచ్ఓ పన్నిపురా అధికారిణి డాక్టర్ బి.మల్లేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించిన రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ఎమ్మెల్యే రాజాసింగ్ ప్రారంభించి మాట్లాడారు. ప్రజలకు కేంద్రరాష్ట్ర ప్రభుత్వ పథకాలు అందేలా తనవంతు కృషి చేస్తానన్నారు. ధూల్‌పేట్‌లోని తన కార్యాలయంలో ప్రజలు సంప్రదిస్తే అర్హులైన వారికి ప్రభుత్వాల పథకాలు అందించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. మహాలక్ష్మి పథకంతో మహిళలంతా ఉచిత బస్సు ప్రయాణం చేయొచ్చన్నారు.

సుల్తాన్‌బజార్: మహిళామణులు ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత బస్సు రవాణా వసతిని సద్వినియోగం చేసుకోవాలని గోషామహాల్ నియోజకవర్గం ఎమ్మెల్యే రాజాసింగ్ లోధా సూచించారు. ఈ మేరకు ఆదివారం మహిళలకు ఉచిత రవాణ వ్యవస్థను కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్‌తో కలిసి ఎమ్మెల్యే రాజాసింగ్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత రవాణాను తాము స్వాగతిస్తున్నామన్నారు. ఇలాంటి పథకాలు తీసుకొచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను సమవర్థవంతంగా అమలు చేయాలని కోరారు. బీజేపీ నాయకులు సురేఖ ఓంప్రకాష్,శశికళ, శైలేందర్‌యాదవ్, అవినాష్, శ్రీకాంత్, బబ్లూ తదితరులున్నారు.

పాతబస్తీ అభివృద్ధికి కృషి

చార్మినార్: పాతబస్తీ అభివృద్ధికి తమ పార్టీ నిరంతరం కృషి చేస్తోందని చార్మినార్, బహదూర్‌పురా మజ్లిస్ పార్టీ ఎమ్మెల్యేలు మీర్ జుల్ఫీకర్ అలీ, మహ్మద్ ముబీన్ అన్నారు. ఆయా నియోజకవర్గాల నుంచి భారీ మెజార్టీతో విజయం సాధించి ఎమ్మెల్యేగా పదవీబాధ్యతలు చేపట్టిన సందర్భంగా దూద్‌బౌలీకి చెందిన మజ్లిస్ పార్టీ నాయకులు రాజేశ్వర్‌రావు,ఆర్.దీపేష్ రాజ్‌వర్మలు ఆదివారం ఇరువురు ఎమ్మెల్యేలను సన్మానించారు. దూద్‌బౌలీలో ఏర్పాటు చేసిన సన్మానం కార్యక్రమంలో స్థానిక మజ్లిస్ పార్టీ కార్పొరేటర్లు, కార్యకర్తలు, నాయకులు పాల్గొని వారికి అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ఆదేశాల మేరకు పాతబస్తీలోని తమ నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తామని, ప్రజలకు అందుబాటులో ఉంటామన్నారు.

గురుగ్రంథ సాహెబ్ పఠనం

పఠనంలో పాల్గొన్న శిక్షకులు



అబిడ్స్ : గురుగ్రంథ సాహెబ్ పఠన కార్యక్రమం జోరుగా నిర్వహించారు. దక్షిణాదిలో తొలిసారిగా గౌలిగూడలోని గురుద్వారలో 33 విద్యార్థులు ఈ పఠనంపై శిక్షణ పొందారు. ఆదివారం నాందేడ్‌కు చెందిన సిక్ హెడ్ గ్రంథి సాహెబ్ కాశ్మీర్ సింగ్, నాందేడ్, లంగర్ సాహెబ్‌కు చెందిన సంత్ బాబా బలీవ్వందర్‌సింగ్‌లు శిక్షణ పొందిన వారికి ప్రశంసా పత్రాలు, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా జ్ఞాని హర్నీల్‌సింగ్ మాట్లాడుతూ.. నాలుగేళ్ల క్రితం ప్రారంభించిన ఈ శిక్షణ కార్యక్రమం పూర్తి కావడం సంతోషంగా ఉందన్నారు. సెంట్రల్ గురుద్వార్ అధ్యక్షుడు ఇందర్‌సింగ్ మాట్లాడుతూ.. మహాపురుషులు సంత్‌లకృపతోనే తమ గురుద్వారాలో ఈ మహోన్నత కార్యక్రమం జరిగిందన్నారు. ఈ సందర్భంగా సిక్కు సాంప్రదాయాల ప్రకారం పూజలు నిర్వహించడమే కాకుండా గురుగ్రంథ సాహెబ్ పఠనం నిర్వహించారు.

బస్సులో ప్రయాణించిన ఎమ్మెల్యే



ఎమ్మెల్యే రాజాసింగ్, తహశీల్దార్ ప్రేమ్‌కుమార్

అబిడ్స్ : గోషామహాల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంపై అడిగి తెలుసుకున్నారు. అబిడ్స్ నుంచి ఎల్బీస్టేడియం వరకు నాంపల్లి తహశీల్దార్ మన్నె ప్రేమ్‌కుమార్, ఇతర అధికారులతో కలిసి బస్సులో ప్రయాణం చేశారు. మహిళలందరూ ఈ ఉచిత బస్సు సౌకర్యాన్ని వినియోగించుకోవాలని సూచించారు.